


పెద్ద కథ

"అందం, ఆత్మీయత, నీ మనసులోనే ఉన్నాయి. నాకు ఆనందం కాక మరేమిటి సుధా!" అన్నాడు సారథి; వెక్కి వెక్కి ఏడుస్తూ అతని భుజాల నానుకుని దీనంగా కూర్చున్న సుధను సముదాయించటానికి ప్రయత్నిస్తూ.

సుధకు మశూచికం వచ్చి రెండు వారాలయింది. ఇంక నేడో రేపో హాస్పిటలునుండి విడుదల చేస్తా రనుకుంటున్నారు. మశూచికం అని అనుమాన పడిన వెంటనే హాస్పిటలులో చేర్చారు. టీకాలు వేయించుకుంటే మశూచికం రాదంటారు. ఏమిటో! సుధ కనీసం రెండేళ్ళ కొకసారయినా టీకాలు వేయించుకుంటూనే ఉంటుంది. ఇంకా ఈ యేడే వేయించుకోలేదు. సెలవు లయిపోయాక కాలేజీకి పోగానే వేయించుకోవచ్చు ననుకుంది. ఇంతలోనే ఆమె అదృష్టం తిరగబడి ఆ మాయదారి జబ్బు రానే వచ్చింది. రావడంలోనూ చాలా ఉధృతంగా వచ్చింది.

స్వతహాగా సుధ అందమయిన వాళ్ళలో అందమయిన దని చెప్పాలి. పొడవుగా సన్నగా ఉన్న శరీరం, వంపులుతిరిగే సన్నని నడుము, మంచి అంగసౌష్టవం-తీర్చిదిద్దిన ముఖ లక్షణాలు 'చెంపకు చారెడేసి' అన్నట్లు వెడల్పయిన కనులు, దబ్బపండులా మెరిసే పచ్చని శరీరచ్ఛాయ, నల్లగా మిసమిసలాడే బారెడు పొడవు జుత్తు, ఆమె అందమయినదని చాటి చెపుతూనే ఉంటాయి. సుధకిప్పుడు పద్ధెనిమిది సంవత్సరాలుంటాయి. బి.ఏ. రెండవ సంవత్సరంలోకి వచ్చింది.

సారథి సుధకు ఒక వేలువిడచిన మేనత్త కొడుకు. అతనిది మంచి ఒడ్డూ పొడుగూగలిగి పరిశ్రమ చేసిన శరీరం. చామన ఛాయగా ఉంటాడుకాని ఆకర్షణీయమైన విగ్రహం. సుధకు పది పన్నెండు సంవత్సరాలు వచ్చినప్పటినుండీ వీరిద్దరికీ సంబంధం ఖాయమైనట్లే చెప్పుకుంటున్నారు. వారి కుటుంబాలలో సుధ అందాన్ని చూచే—సుధ తండ్రికి కట్నకానుకలంతగా యిచ్చే స్తోమత లేకపోయినా సారథి తల్లి ముచ్చటపడింది.

సారథి అప్పుడప్పుడు వీరి యింటికి వస్తూ పోతూండడం కూడా అలవాటే. క్రిందటి యేడే పెండ్లి చేసేయాలని తలపెట్టాడు సుధ తండ్రిగారు. కాని సుధ బి. ఏ. అయినా పూర్తి చేయనీండి అని పట్టుబట్టింది. సారథి కూడా ఆమాటే అన్నాడు. తను ఆనర్సు పూర్తయి ఏదో ఉద్యో

గము చూచుకోవటం, సుధ బి. ఏ. పూర్తవటం రెండూ ఒక్కసారే కావచ్చునని అప్పుడు చేసికో వచ్చుననీ...

సుధ మొదటి సంవత్సరం చదువు పూర్తయి వేసవికి యింటికి వచ్చింది. ఆమెకు జ్వరం వచ్చిన పదవనాడు బావకు ఉత్తరం వ్రాయండని పట్టుబట్టింది. 'సుధ నిన్ను చూడాలని అంటూంది' అని సుధ తండ్రి సూర్యనారాయణగారు వెంటనే కాబోయే అల్లునికి ఉత్తరం వ్రాశారు. సారథి పదిహేనవనాటికి బయలుదేరి వచ్చాడు.

ఒకప్పుడెంత అందమయినదయితే నేమి? సుధ చాలా పాడయిపోయింది మశూచికంతో. మనిషి చాలా నీరసించింది. అంత పచ్చని మనిషీ చిత్రంగా నల్లబడిపోయింది. ముఖానిండా చేతులనిండా మచ్చలు. కొన్ని కొన పొరలు ఊడుతూన్న బొబ్బలు ఆమె శరీరాన్ని వెక్కిరిస్తున్నట్లున్నాయి. నుదుటి మీద ముందరకు ఉన్న వెంట్రుకలు కొన్ని ఊడిపోయి ఏదో బోసిగా ఉంది.

బావ వస్తున్నాడని తెలిసి సుధ శుభ్రమైన చీర కట్టుకుంది. నర్సుచేత రెండు జడలు వేయించుకుంది. మంచంమీద కూర్చునే అద్దం ఒకసారి చూచుకుంది. జబ్బు చేశాక ఆమె అంతవరకూ అద్దం చూసుకోలేదు. తన అందం హరించిపోయిందని ఆమెకు తెలీకపోలేదు. చేతులు, మిగతా శరీరాన్ని చూచుకుని లోలోన బాధపడేది. కాని ఇంతగా, ఇంత వికారంగా తయారయినదని ఆమెకే తెలీదు. ఒక్కసారి అద్దంలో తన ప్రతిబింబం చూచుకుని నిర్ఘాంతపోయింది. దుఃఖం పొర్లిపొర్లి వచ్చింది. అద్దం అక్కడే పారేసి వెక్కివెక్కి ఏడ్చింది. నర్సు ఓదార్చటానికి ప్రయత్నించింది. 'చూడమ్మా చదువుకున్న అమ్మాయివి అట్లా బాధపడకూడదు. మనస్సులో విచారం పెట్టుకుంటే మళ్ళీ జ్వరం వస్తుంది. ఈ మచ్చలు క్రమంగా తగ్గిపోతాయి. ఇంకా స్నానమయినా చేయలేదు కదూ! ఇప్పుడున్నంత ఎక్కువగా ఎప్పటికీ ఉండిపోవు" అని.

సుధకు తెలుసు, పోయిన అందం ఎలాగా తిరిగిరాదని-ఆ నర్సు ఊరికనే తనను ఓదార్చటానికి అలా అంటూందని. ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పడుకున్నదామె. బావ వచ్చేదని నర్సు లేపేదాకా తెలివిరాలేదు. బావను చూడగానే మళ్ళీ దుఃఖం పొర్లుకుని వచ్చింది. అక్కడే ఆ నర్సు ఉన్నదని కూడా మరిచిపోయి 'బావా నన్ను చూస్తే అసహ్యం వేయడంలేదూ!' అంటూ పమిట చెంగుతో ముఖం కప్పేసుకుంది. నర్సు ద్వారం వద్ద వ్రేలాడుతున్న తెరను సరిగావేసి అక్కడినుండి వెళ్ళిపోయింది.

"సారథికూడా ఆమెను చూస్తూనే దెబ్బతిన్నవాడిలా అదోలా అయిపోయాడు. కాని ఇంతలోనే సుధ వైఖరి చూచి తనలో ఉన్న ధైర్యం, ఔదార్యం, కూడగట్టుకున్నాడు.

"బావా! నీకు నే నానందాన్నివ్వగలనా! నన్ను చూసుకుంటే నాకే అసహ్యం వేస్తూంది. నావల్ల నీకు సుఖమెలా ఉంటుంది." అన్నది దగ్గరగా కూర్చుని ఉన్న అతని భుజాలమీద తలవాలుస్తూ.

అప్పుడే అన్నాడు సారథి 'అందం, ఆత్మీయత నీ మనసులోనే ఉన్నాయి. నాకానందం కాక మరేమిటి సుధా!' అని. దుఃఖం మరీ ఎక్కువగా నున్నపుడు ఏమాత్రం ఓదార్పు మాట విన్నా ఆ దుఃఖం కట్టతెగిన నదిలా మరింత వెల్లువికి ప్రవహిస్తుంది. అలానే సుధ తన మనసులోని కష్టాన్నంతటినీ కన్నీటిగామార్చి బావ భుజాలను తడిపివేసింది.

సారథి ఆమె వీపు నిమురుతూ 'లే! సుధా! నేనున్నానుగా నీకు భయమెందుకు. అలా ఏడిస్తే మళ్ళీ జ్వరం వస్తుంది. అసలే నీరసంగా ఉన్నావు-అలసిపోతావు' అంటూ మరింత దగ్గరకు తీసుకున్నాడు. సుధకు ఆ ఓదార్పులో, ఆ దగ్గర తనంలో ఏదో పరవశత చెందినట్లయింది. అతని ఒడిలో వ్రాలిపోయి అతని నడుంచుట్టూ చేతులు చుట్టేసి అతని కళ్ళల్లో కళ్ళుపెడుతూ "బావా! నీకు దూరం కాలేను. నా మనస్సంతా నిండిపోయావు నీవు. నాకు అందంలేదని నన్ను త్రోసివేయకు" అంటూ పెనవేసికుందతనిని.

నర్సు టెంపరేచరు చూడటానికి వచ్చి తలుపు చప్పుడు చేసింది. సుధకు మత్తువిడి అతనిని వదలి పమిటి సర్దుకని కూర్చుంది. నర్సు వస్తూనే "ఇది అంటు జాడ్యం మిస్టర్! మీరలా ఆమె మంచంపైని కూర్చోకూడదు!" అని హెచ్చరించింది. తన పని ముగించుకుని వెళ్ళిపోయింది.

నర్సు అనిన మాటలతో సుధకు మరొకభయం వేసింది. 'ఏమిటి! స్నానమయినా చేయకుండా ఇలా బావనంటుకున్నానే; ఊరికే అంటుకోవడమా! అతని ఒడిలో వాలిపోయానే! అతన్ని చుట్టేసేనే! అతని ముఖంలో ముఖం పెట్టానే! కొంపదీసి బావకుకూడా రాదుకదా...'

'పొరపాటు జరిగింది బావా! ఏదో ఆవేశంలో నా జబ్బుమాటే మర్చిపోయి నిన్ను...'

'ఫరవాలేదు సుధా ఏమిటో అంటారు కాని- నువ్వు ఎవరిని ముట్టుకుంటే వచ్చింది చెప్పు నీకూ.'

'అదికాదు బావా! ఇంత దగ్గరగా ఇద్దరమూ కూర్చున్నాము కదా కొంపదీసి నీకు రాదుకదా మశూచి?' అన్నదిభయంగా వెర్రిచూపు చూస్తూ.

'పిచ్చిపిల్లా! నీకు రాగాలేంది! నాకు వస్తే తప్పా? అప్పుడు ఇద్దరం సమానమే అవుతాం—మరేం భయం లేదులే—నాకేమీ రాదు. బెంగ పడకు' అన్నాడు.

సుధ మనసులో వెయ్యి దేముళ్ళకు మొక్కుకుంది బావకు ఇలాంటి ఆపద రాకూడదని.

ఇంతలోనే సూర్యనారాయణగారు వచ్చారు- 'ఏమోయి ఎప్పుడు రావటం!' అని పలుకరిస్తూ— 'ఇప్పుడే నాన్నా! ఒక గంటయింది బావ వచ్చి' అన్నది సుధ తన ముఖంలో అంతవరకూ ఉన్న దైన్యాన్ని మరుగు పరచటానికి ప్రయత్నిస్తూ.

• • •

సారధి ఆ తరువాత సుధను చూడటానికి మరొకసారి కూడా వెళ్ళాడు ఆ ఊరికి, ఆమె కొంచెం లేచి తిరగటం మొదలు పెట్టాక.

ఇంతలో కాలేజీ తెరవటం అతను విశాఖపట్నం వెళ్ళటం జరిగిపోయింది. సుధ తానా యేడు కాలేజీలో చేరటం లేదని ఉత్తరం వ్రాసింది. "ఇంక నాకు చదువుకోవాలని లేదు. పదిమందిలో తిరగటానికి సిగ్గువేస్తూంది" అని బాధపడుతూ వ్రాసింది. అతడు కూడా ఆమెనేమీ ఇబ్బంది పెట్టలేదు. "నీ యిష్టం వచ్చినట్లే చేయి" అని వ్రాశాడు.

సూర్యనారాయణగారు ఏమనుకొన్నారోగాని ఒకసారి విశాఖపట్నం వెళ్ళి సారధిని కలుసుకుని అమ్మాయి పెండ్లివిషయం మాట్లాడారు. 'అమ్మాయి చదువుకోసమే ఇన్నాళ్ళు ఆట్టే బెట్టేం. ఇప్పుడది చదవనంటూంది. ఇంక నువ్వు 'ఊ' అంటే అంతా సిద్ధం చేస్తాను.' అంటూ ఒక్కసారిగా అంత మనిషీ ఎంతో దీనంగా 'చూడు సారధీ! చిన్నప్పటినుండీ నీమీదే ప్రాణాలు పెట్టుకుని ఉన్నాం. తల్లిలేని పిల్ల. దాని మనస్సు నీకు తెలుసు కదూ! అంత చక్కని పిల్ల - విధి దానినలా చేసింది. పోనీలే బ్రతికి బయట పడింది. అదే పదివేలు అనుకుంటున్నాను. మరొకలా మనసు మార్చుకోకు నాయనా! పెద్దవాణ్ణి నా మాట మన్నించు' అంటూ చేతులు పట్టుకుని కళ్ళంట నీళ్ళు పెట్టుకున్నారు.

"సుధ బాధ పడిందంటే అర్థం ఉంది. మీరెందుకిలా బాధపడుతున్నారో నాకర్థం కావటంలేదు. ఏదో కాస్త తోలు రంగు మారినందుకింత బాధ పడటం ఏమిటండీ పిచ్చిపని. అంతమాత్రానికే మనస్సు మార్చుకుంటాననుకున్నారా!" అంటూ "సరే మా నాన్నగారికి వ్రాసి పెండ్లిప్రయత్నాలు చేయండి. ముహూర్తం నిశ్చయించి వీలయినంత ముందుగా వ్రాయండి నాకు" అని సాగనంపాడు మామగారిని సారధి.

నిజానికి అతడు కూడా ఆ యేడు చదువు పూర్తయేక వివాహం చేసుకోవాలనుకున్నాడు. కాని తాను మాట తిరిగిపోతానేమో అనే అనుమానం, భయం, ఆ తండ్రీ కూతుళ్ళ నిద్దరినీ బాధిస్తూంది. అందుచేత 'ఊ' అని ఆ కాస్తా పూర్తయిపోనిస్తేనే బాగుంటుంది అనుకున్నాడు.

పెండ్లికి ముహూర్తం నిశ్చయించే ముందు సారధి తల్లిదండ్రులు కొంత గడబిడ చేశారు. 'ఎప్పుడో మాట యిచ్చినంత మాత్రాన ఆ పిల్ల అందం చెడిపోయినా ఆమెనే చేసికోవాలా ఏమిటి?' అంటూ.

ఒక్కగానొక్క కొడుకు; ఆస్తికి లోపం లేదు. ఇంతకన్న ఎన్నో రెట్లు మంచి సంబంధం వస్తుందని ఆశ పడ్డారు. సారధికి పదే పదే ఉత్తరాలు వ్రాశారు. 'తరువాత విచారించి లాభం లేదనీ ముందే ఆలోచించుకోమనీ—సుధ సంబంధం వదులుకో వలసిందనీ-'. సారధికి కోపం కూడా వచ్చింది.

"సుధను తను మనసారా ప్రేమించాడు. ఎప్పుడో వాళ్ళు భార్యాభర్తలైపోయామనుకున్నారు. ఇప్పుడీ హడావుడి ఎందుకు? ఒకవేళ ఆ పెండ్లికాస్తా జరిగాక సుధకు మశూచి వచ్చి

ఉంటే—ఆమెను వదిలి మరొకతెను పెండ్లి చేసికోమంటారా వీళ్ళు!" అని బాధపడ్డాడు.

అతను వాళ్ళ నాన్నగారికి ఘాటుగా ఉత్తరం వ్రాశాడు—తనకామె అందంతో నిమిత్తంలేదనీ వెంటనే ముహూర్తం పెట్టించ వలసినదనీ—

ఆ యేడు శ్రావణంలో పెండ్లయింది- కాని పరీక్షలయేవరకూ సారథి సుధను తీసుకుని వెళ్ళలేదు. ఆ నర్సు పాసవటం అక్కడే యూనివర్శిటీలో డిమాన్‌స్ట్రేటరుగా చేరటం సుధను విశాఖపట్టణం తీసుకుని వెళ్ళటం అన్నీ ఒకదానివెంట ఒకటి జరిగిపోయాయి.

* * *

సుధ జబ్బుపడిన తరువాత కొంచెం వళ్ళు చేసింది. ఇదివరకంత సన్నగా కాకుండా కొంచెం బొద్దుగా తయారయింది. కాస్త వళ్ళు చేయడం మూలానేమో ఆ కొత్తల్లో ఉన్నంత నలుపు ఛాయ కూడా లేదు. మనిషి కొంచెం తేరిందనే చెప్పాలి. కొంత జుట్టూడిపోయినా క్రొత్తగావచ్చి మెలికలు తిరుగుతూన్న పొట్టి పొట్టి ఉంగరాల జుట్టు ఆమె ముఖానికి క్రొత్తరకం కళను తెచ్చాయి. ఏమయితేనేం, ఆమె శరీరం కోలుకున్నా మనస్సు కోలుకోలేదు. సుధ పెండ్లయినాక చాలా ఆనందంగా ఉంటుందనుకున్నాడు సారథి. తానామెను పెండ్లి చేసికోనేమోనని భయపడింది. ఇప్పుడాభయం తీరింది, కనుక ఆమె దిగులంతా పోతుంది అనుకున్నాడు. కాని ఆ మొదటి రోజు రాత్రి ఆమె ప్రవర్తన అతని కాశ్చర్యం కల్గించింది.

అతడామెను ప్రేమగా ముద్దుగా చేరదీశాడు. ఆమె వెక్కి వెక్కి ఏడ్వటం పెట్టింది. అతను బిత్తరపోయాడు. 'ఏమిటిది సుధా ఎందుకూ దుఃఖం' అని సముదాయించాడు. ఆమె జవాబు చెప్పలేదు. ఏడ్చి ఏడ్చి అలానే నిద్రపోయింది.

'వట్టి అమాయకురాలు! ఆడవాళ్ళంతా ఇంతే నాకోలు' అనుకున్నాడు.

ఆమెను సంతృప్తి పరచటానికి, ఆమె మనస్సులో పూర్వం మాదిరి చురుకుతనం కల్పించడానికి, ఎంతయినా ప్రయత్నం చేశాడు.

ఒకప్పుడు చెంగున గంతులేస్తూ వాలుచూపులు చూస్తూ పరుగులెత్తే లేడిపిల్లలాగ ఉండే సుధ ఈనాడు తన గమ్యం తనకే తెలియకుండా పోతూన్న తాబేలులా బండబారి పోయింది.

ఒకప్పుడు అప్పుడే విరిసి పరిమళాలు వెదజల్లే జాజి పువ్వులా ఉండే సుధ యిప్పుడు విడలేని మొగ్గగా ఎందుకో ముడుచుకుని పోతూన్నట్లనిపించింది.

సన్నని పిల్లవాయువులు వసంత రాగం ఆలపిస్తూంటే, లేతమబ్బుల నీడలలో దోబూచులాడే మధుమాస చంద్రికాసుధలను వెదజల్లే ప్రకృతివలె గిలిగింతలు పెట్టే సుధ, వర్షర్తు ప్రారంభంలో దట్టమై గంభీరమై, ఉరుపక, మెరవక, వర్షించ లేక, బరువెక్కి స్తంభించి పోయిన వాతావరణం వలె ఉంది.

ఒక్కొక్కప్పుడు సారథి "ఈమె కేమైనా మతిపోయిందా! ఈమె ఉన్మాదిని కాదు కదా!" అనుకునేవాడు.

'సుధా సినిమాకు పోదాం పద. మంచి ఇంగ్లీషు పిక్చరు వచ్చింది' అన్నాడొకనాటి సాయంత్రం పెందరాళే యింటికివచ్చి.

'ఆ! ఈ ముఖానికి సినిమా ఒకటే తరువాయి. మీరు వెళ్ళండి. నేను రాలేను నాకు సిగ్గువేస్తుందీ అవతారంతో వెళ్ళటానికి—' అన్నదామె.

ఆమె పదిమందిలోనికి వెళ్ళటానికి సిగ్గువేస్తుందనుకున్నదే కాని, అతడెంత ఆప్యాయంగా అడిగాడో గుర్తించలేదు. తనను అడుగకపోతే తాను బాధ పడతుందేమోనని అలా అడిగాడనుకున్నది. కాని, నిజంగానే ఆమెతో కలసి సినిమాకి వెళ్ళటానికతడెంత ఉబలాటపడ్డాడో ఆమె గ్రహించలేదు. తనతో కలసి వెళ్ళటంలో అతడు పొందగలిగే ఆనందం ఆమె ఊహించలేదు. సారథి ఆమె జవాబు విని మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

మరొకనాడు సారథి సాయంత్రం యింటికి వచ్చేసరికి జాజిపందిరి దగ్గర కూర్చుని జాజిపువ్వులు దండ గుచ్చుతూంది సుధ. ఆరోజామె లేత గులాబీరంగు సిల్కుచీర కట్టుకుంది. నల్ల పట్టు జాకెటు వేసికుంది. సారథి కామె అలా పువ్వులు గుచ్చుతూంటే చూడ ముచ్చటగా అనిపించింది. వెనుకనుండి వెళ్ళి కళ్ళు మూశాడు. నవ్వుతూ ఆమె అతని చేతులుతీసి "చాలా త్వరగా వచ్చారే ఈరోజు" అన్నది.

"అవునుకాని రోజూ ఈ పువ్వులు దండగుచ్చి ఏ టేబిలుమీదనో పెట్టి ఆనందిస్తావు కాని తలలో పెట్టుకోవేమి సుధా! నల్లని నీ జుట్టులో తెల్లగా ఈ పువ్వు లెంత బాగుంటాయనుకున్నావు. ఇలా తే నేనే పెడతాను నీ జడలో" అన్నాడు బలవంతంగా ఆమె చేతిలోని దండను తీసుకుంటూ.

ఆమె ముఖంలో నవ్వు అంతలో మాయమైంది. ఒక్కసారి విదిలించుకుని "ఈ ఊడిపోయిన జుట్టు-ఈ అందమయిన ముఖం-పువ్వులొక్కటే తరువాయి నాకు" అన్నది.

సారధికి చాలా కోపం వచ్చింది. "నేను చచ్చిపోయేవరకూ నువ్విలానే ఉండేటట్లున్నావు"—అంటూ ఆ దండ అక్కడే పారేసి చరచరా వెళ్ళిపోయాడు బయటికి.

ఇలాంటి సంఘటన లెన్నో జరిగాయి వారిద్దరి మధ్య-సారధికి చాలాసార్లు కోపం వచ్చింది. కాని అతని కోపం క్షణికం. "ఇంత కాలమయినా ఈవిడకీ మనోవేదన ఏమిటి? తన రూపంగురించి యింత బాధెందుకు? నేనున్నానుగా తనను ఆదరించి నెత్తిమీద పెట్టుకుందుకు" అని మథనపడేవాడు. అంతలో "అసలే ఆవిడ మనస్సు పాడయింది. తను చాలా అందవికారినై పోయానని ఒకరకమైన దిగులుపట్టుకుంది. నేను కూడా చిరాకుపడితే మరింత పాడైపోతుందేమో ఆమె మనస్సు" అని శాంతపడి ఓదార్చటానికి ప్రయత్నించే వాడు.

"చదువుకున్నదానివి ప్రపంచజ్ఞానం కలదానివి. ఇంత మొండితనం ఏమిటి సుధా? నీ వందంగా లేవని నువ్వనుకుంటున్నావు. నాకలా అనిపించటం లేదు. నీ రూపం ఎంత మారినా నీలో యింకా తరగని అందం ఉంది. ఎవరనగలరు నీవు కురూపివని?" అంటూ ఎన్నోసార్లు బుజ్జగించాడు.

నిజంగా సారధి హృదయంలోనుండి వచ్చిన మాటలవి. నిజంగానే అతడామెలో అందాన్ని చూడగలిగాడు. అతని కెప్పుడూ ఆమె యెడల అనురాగమే.

కాని సుధ భావం వేరు- "సారధి మంచివాడే చాలా ఔదార్యవంతుడు-జాలిగుండె కలవాడు-కనుకనే తనను పెండ్లిచేసుకున్నాడు" అనుకుంటుంది. ఆమె కొక దృఢమైన విశ్వాసం; అతనికి తనయందు విపరీతమైన జాలి ఉంది. కాని తన వలన అత డానందం పొందలేడు, తనను చూసి ఎవ్వరూ ఆనందించలేరు అని. సారధి యెన్ని మాటలు చెప్పినా తనయందు జాలిచేతనే తన కోసం, తన సుఖంకోసం అతడలా అంటాడు అనే ఆమె అనుకుంటుంది.

సుధ ప్రకృతి చిత్రంగా మారిపోయింది. ఆమెకు జ్ఞానం వచ్చినప్పటినుండీ ఆమె అందమయినదనే ఒక గర్వం, ఒక ఠీవి, ఆమెలో ఉండేవి. అందరూ అలానే అనేవారు. "చక్కని చుక్క దానికి సాటి ఎవరు!" అని. ఆమెగురించి ఎవరైనా చెప్పుకుంటే ముందు ఆమె చక్కదనం గురించిన ప్రసక్తే వచ్చేది.

ఆమె చదువుకున్నది. కాని మనస్సుకు పరిపక్వత లేదు. ఆ స్థితిలోనే ఆమె చక్కనిది అనే స్థితి మారిపోయింది. అదే ఆమె మనస్సును గాయపరచింది. ఆ గాయ మెప్పటికీ మానలేదు. తన చక్కదనానికి తానే ముచ్చటపడే ఆమె, తనను చూచుకుని తానే అసహ్యించుకుంటూం డిప్పుడు.

సుధ చిన్నప్పుడు తీయించుకున్న రకరకాల ఫొటోలన్నీ తీసి ఎవ్వరికీ కనబడకుండా దాచేసింది. ఆమె అద్దంముందు నిల్చోదు-అద్దంలో చూసుకోదు. తనకు తోచినట్లు జడ వేసుకుంటుంది, అద్దం లేకుండానే బొట్టు పెట్టుకుంటుంది.

ఆమె ఎక్కడికీ వెళ్ళదు. ఎవ్వరితో ఎక్కువ మాట్లాడదు. సాధారణంగా నవ్వదు-నవ్వినా ఆ నవ్వులో అందం లేదు, ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లుంటుంది.

కాఫీ, వంట, సారధికి వేళకు కావలసిన వండించటం వగైరా పనులు ఏదో విధిగా ఒక యంత్రం వలె చేసుకుపోతుంది.

ఆమెలో ప్రకృతి నశించిందా? అనిపిస్తుంది.

కోరికలు లేవు - సరదాలు లేవు.

ఆనందం లేదు - ఆదరణ లేదు.

ఒక జడపదార్థం వలె ఒక యంత్రశక్తివలె ఒక మంత్రముగ్ధవలె-తిరుగుతూంటుందామె ఆ యింట్లో!

కాని సారధి విషయం వేరు-స్వతహాగా అతడు సరదా పురుషుడు. ఆ వయస్సులో ఇద్దరూ కలసి బీచికి వెళ్ళాలని సినిమాకి వెళ్ళాలని ఇంకా ఇంకా

ఎక్కడికి వెళ్ళినా కలసి తిరగాలని ఏవేవో కోరిక లతనికి. ఆమె రాదు. ఇష్టపడక అడుగడు కూడా.

అతడామె నేమీ అనడు కాని మనస్సులో బాధపడుతాడు.

ఆమె అతని బాధ గుర్తించదు. అతడామె బాధను గుర్తించాడు.

అనునయించటానికి ప్రయత్నిస్తాడు.

కాని ఆమె కది అవగతం కాదు.

ఆమె బాధ ఆమెది.

అతని బాధ అతనిది.

రోజులూ నెలలూ గడిచిపోతున్నాయి. అతడు కూడా ఒక యంత్రంలా రోజులు గడపటం నేర్చుకున్నాడు.

వాళ్లు ఎక్కువ మాట్లాడుకోరు-పోట్లాడుకోరు.

సరసమూ లేదు. విరసమూ లేదు.

ఇద్దరూ జడమూర్తులయిపోయారు.

* * *

ప్రకృతిలో వాతావరణం ఎప్పుడూ ఒకేలాగ ఉండటానికి వీలులేదు. స్తంభించిన వాతావరణంలో ఉరుములు, మెరుపులు, వర్షాలు, గాలివానలు రాకుండా ఉండవు.

సారథి ఈ మధ్య క్లబ్బులో చేరాడు. పేకాట మొదలు పెట్టాడు. ఇదివరకులా రాత్రి 7 గంటలలోపున యింటికి రాడు. ఒక్కొక్కనాడు రాత్రి 10, 11 గంటలు కూడా అవుతుంది. ఒక్కొక్కనాడు కాలేజీ నుండి యింటికి రాకుండానే క్లబ్బుకు వెళ్ళిపోతాడు. రాత్రివచ్చాక కూడా ఒక్కొక్కసారి "నా కాకలి లేదు భోజనం చేయను" అని పడుకుంటాడు.

సుధ సారథి క్రమంగా యింటికి వచ్చినన్నాళ్లు అతని గురించి ఎన్నడూ బాధపడలేదు. కాని యిప్పుడిప్పుడు ఆమెకు కష్టం తోస్తూంది. బాధపడుతూంది కాని 'ఎందుకిలా చేస్తున్నారు' అని అడగదు. అడగటానికి ఏదో భయం ఎందుకో సంకోచం. ఏదో తప్పు చేసిన దానిలా ఒదిగి ఉంటుంది. కాని ఆ తప్పును దిద్దుకునే విధాన మామెకు స్ఫురించదు.

ఒకనాడు రాత్రి సారథి పన్నెండు గంటలకు వచ్చాడు. ఆమె భోజనం చేయకుండా కనిపెట్టుకుని ఉండి ఉండి నిద్రపోయింది. అతడు రాగానే 'ఇంత ఆలస్యమైందేం?' అన్నది.

"నే నెప్పుడొస్తే నేం? నీకు బాధ లేదుగా!" అన్నాడతడు.

"పోనీలెండి! భోజనం చేసి మరీ నిద్రపోండి."

"నా కక్కరలేదు."

"కాస్త మజ్జిగా అన్నమైనా తినండి" అన్నదామె బ్రతిమాలే ధోరణిలో.

"నాకేమీ వద్దు. ఇకమీద నువ్వు నాకోసం కూర్చోనక్కరలేదు. నువ్వు భోజనంచేసి నిద్రపో" అన్నాడతడు. ఆమెకు దుఃఖం వచ్చింది. "మీరు భోజనం చేయకుండా నేను భోజనంచేసి నిద్రపోతాననటండీ - నేనంటే మీ కెందు కింత కోపం-" అన్నదామె.

అతడు జవాబైనా చెప్పకుండా బట్టలు మార్చుకుని ముడుచుకుని పడుకున్నాడు. ఆమెకేం చెయ్యాలో తోచలేదు- వెళ్ళి అతని పక్కదగ్గరగా చేరి 'నేనేం చేశానండీ? మీ కెందు కింత కోపం?' అన్నదాతని భుజంపై చెయ్యివేసి అతనిని తనవైపు త్రిప్పుకోవాలని ప్రయత్నిస్తూ.

ఇంకో అప్పుడయితే సారథి ఈ మాత్రం మాటకు కరగిపోయేవాడే - కాని ఆ రోజు తనకు మనస్సు దోలా వుంది. ఆ ముందు దినం క్లబ్బులో ఒక స్నేహితుడు "ఏమోయి సారథీ! ఈ మధ్య అర్థరాత్రిదాకా పేకాటలో పడ్డావు. పెండ్లయి సంవత్సరం దాటిందో లేదో ఇప్పుడే ఆమెకు హడలగొట్టేస్తున్నావు" అన్నాడు. సారథికి ములుకుల్లా తగిలాయా మాటలు.

"పెండ్లట! పెండ్లి! ఏమి అనుభవించాడు తను కొత్త దాంపత్య జీవితాన్ని? వీళ్ళకేం తెలుసు? తనెందుకు అర్థరాత్రివరకూ అక్కడా యిక్కడా గడపవలసి వస్తూందో!"

అందుకే ఆ దినం క్లబ్బుకు వెళ్ళటానికి బుద్ధి పుట్టలేదు- సినిమాకు వెళ్ళాడు. సగంలోనే వచ్చేశాడు. సినిమాకి వెళితే మరింత కలవర పడింది మనస్సు. బీచి ఒడ్డంట నాలుగు మైళ్ళు తిరిగాడు. భోజనంలేదు- పొద్దుటనుండి విశ్రాంతి లేదు. మనస్సు పరిపరి విధాలా పోతూంది.

"సుధ! నా జీవితంలో సుధలను కురిపిస్తుందను కున్న సుధ. సుధ కాదది విషపు మూర్తి - మనిషి

కాదు - రాయి - ఏమిటీ ఉదాసీనం - ఎందుకీ ఏడుపు."

సుధను గురించి యింత కర్కశమైన, బరువైన ఆలోచనలు యిదివరకెన్నడూ రాలేదతనికి.

అలసిన శరీరం - బరువెక్కిన ఎడద - తీరని కోరికలు అతని ప్రకృతినే మార్చివేశాయి.

అందుకే "మీకెందుకంత కోపం" అని సుధ అనిన మాటలు అతనిని మరింత రెచ్చగొట్టాయి. అతనికి ఎప్పుడూ రానంత కోపం వచ్చింది. "ఛీ! నీతో మాట్లాడడానికే నాకసహ్యం. నన్ను విసిగించకు" అని విదిలించుకున్నాడు.

సుధలో రగులుతున్న ఆవేదన-తనను అందరూ అసహ్యించుకుంటూరనే పిచ్చి విశ్వాసం అతడనిన మాటలతో మరింత ఉద్రిక్తమయింది.

"అవును నాతో మాట్లాడడాన్ని కసహ్యించుకుంటారని ఎప్పుడో అనుకున్నాను. నాకా సంగతి చాలా కాలం క్రిందటే తెలుసును. ఇంతకీ నాదొక దరిద్రపు బ్రతుకు' అంటూ అవతలకి వెళ్ళిపోయింది.

'నీదికాదు ఆ దరిద్రం అంతా నాది. ఈ యింట్లో నాకు సుఖంలేదు' అంటూ విసవిస నడిచిపోయాడు సారథి ఇల్లువదలి. ఆమె వద్దనలేదు-చూస్తూ నిల్చుండిపోయింది.

మనస్సు చాలా చిత్రమయినది. త్రోవలేని చోటికికూడా త్రోవ చేసికుని పోతుంది. అవకాశాలు లేని చోట అవకాశాలు కల్పించుకుంటుంది. అనుమానాలు లేనిచోట అనుమానాలు సృష్టించుకుంటుంది. ఆ అనుమానాలను ఏవేవో కల్పనలతో ధృడపర్చుకుంటుంది.

అనుమానికి హేతువు ఎంత తృణప్రాయమైనదైనా చాలు. గడ్డివాములో చిన్న నిప్పురవ్వ పడితే లోలోపలే రగిలిపోతుంది. నిప్పు కనబడకుండానే పొగలెగసి పోతాయి. మంట మండే సరికి అంతా నుసియైపోతుంది. అనుమానం ఆ నిప్పురవ్వ లాంటిది.

"ఈ యింట్లో నాకు సుఖంలేదు' అనే సారథి మాటల్లో వింత అర్థాలు స్ఫురించాయి సుధకు. 'అవును ఈ యింట్లో ఆయనకు సుఖంలేదు. నావంటి కురూపితో ఎలా ఉంటుంది? మరొక యింట్లో ఉండిఉంటుంది. అందుకే ఈ అర్ధరాత్రులందు రావటాలు, ఇంటిపట్టున ఉండక పోవటాలు. నేను భయపడినంతా జరిగింది' అని సమాధానం చెప్పుకున్నది.

... కాని ఈ చిన్నయింట్లో సుఖంలేని కారణాన, ఈ అనంత విశ్వంలో, ఎక్కడో ఒక చోటున, ఏ యిసుక పొరలమీదనో, ఏ కొండరాళ్ళమీదనో, కాలం గడపటానికి, కాలక్షేపం చేయటానికి, వెళ్ళాడతనని ఆమెకు తోచలేదు.

సారథి వెళ్ళిపోయాడే కాని మనస్సు బాధపడుతూంది తాను చేసిన పనికి. "అకారణంగా ఆమెమీద కోపగించుకున్నానే" అని. సుధ ఈ దినం ప్రత్యేకం చేసిన తప్పిదం ఏమీలేదు సరికదా ఎప్పటికంటే కొంచెం దారిలోకి వచ్చింది. 'మళ్ళీ తనే పెడదారి త్రొక్కాడు. 'ఏమిటీ అతకని బ్రతుకులు. ఛీ! నేనే పొరపాటు చేశాను" అనుకున్నాడు. తెల్లవారుఝాము వరకూ బీచి ఒడ్డున అక్కడా అక్కడా తిరిగి చీకటి ఉండగానే బయలుదేరి యింటికి వచ్చాడు. వస్తూనే సుధను ఊరడించాలనుకున్నాడు. 'ఏదో కోపంమీద అలా అన్నాను. బాధపడకు.' అని అనునయించాలనుకున్నాడు. తలుపు తట్టగానే ఆమె తలుపు తీసింది. ఆమె కళ్ళు జ్యోతులలా వెలుగుతున్నాయి. కోపం, అవమానం, దుఃఖం అందులో ద్యోతకమవుతున్నాయి.

"పిచ్చిపిల్లా! రాత్రంతా నిద్రపోలేదు కదూ—ఏడుస్తూ కూర్చున్నావా?" ఆమె ముఖంలో ముఖంపెట్టి, ఆమె కళ్ళల్లోకిచూస్తూ, ఆమె రెండు భుజాలపై తన రెండు చేతు లానించి, జాలిగా, ఓదార్పుగా, లాలనగా అన్నాడతడు.

ఆమెకు వళ్ళు మండింది. రాత్రి ఆ విసవిసలెందుకు? ఇప్పుడీ ఆదరణ ఎందుకు? తనను మంచి చేసికోవాలనే కదూ ఇదంతా—ఎందుకూ మంచి చేసికోవడం—అతని దారికి తానేమీ అడ్డుకడ లేదుగా... ఒక్క క్షణంలో ఉరుములూ ఉరిమాయి ఆమె మనస్సులో.

"చాల్లెండి నన్నేం ఓదార్చనవసరంలేదు-మీరు సుఖంగా గడిపారుకదా మిగిలిన రాత్రయినా-నేను ఒక్కరాత్రి మాత్రమే ఏడవటమేం? ఎప్పుడో ఏడవటం మొదలుపెట్టాను-ఇంకా తెల్లవారకుండానే వచ్చావారేం? నలుగురూ చూస్తారనా! అంత భయం దేనికి? నావల్ల సుఖం పొందకపోయినా

మారెవరివల్లనయినా సుఖం పొందితే నేను బాధ పడను" అపుడో లేని ఉద్వేగంలో అనేసిందా మాటలు.

అతని వళ్ళంతా తేళ్ళు జెర్రులు ప్రాకినట్లయింది. తాను నడిసముద్రంలో కొట్టుకుని పోతూన్నట్లనిపించింది. హాలాహలం మ్రింగి దహించుకుని పోతున్నట్లయింది. ఆమె భుజాలపైనున్న చేతులు అలానే జారిపోయాయి. అతనికి మాటలు రాలేదు. ఆవేశం, అవమానం ఉధృతమై, ఉప్పెనవలె ఉవ్వెత్తుగా లేచి, అతనిని ముంచెత్తి, మూగవాడిని చేశాయి. అసలే అలసిన హృదయం. ఆవగింజంత భారం కూడా మోయలేదు. ఆమె అనుమానం అతనిని అవమానపరిచింది. అతని అవమానం ఆమెపై పగబట్టింది.

అతని ముఖం ఎర్రబడింది. కళ్ళల్లో రక్తిమలు భయంకరంగా ఉన్నాయి. పగబట్టిన పాములా, దెబ్బతినిన సింహంలా కోపోద్దీపితుడై ఉన్నాడతను. అతనిని చూస్తే భయంవేస్తుంది.

ఆమె అతని ముఖంవైపు ఒక్కసారి చూచి చూడలేక రెండు చేతులతో ముఖం కప్పుకుంది. ఆమె నిలువునా కంపించి పోతూంది. ప్రళయం వచ్చి మీద బడినట్లయిందామెకు—ముఖాన్ని కప్పిఉన్న చేయి చెంపకు అంటిపోయిందా అన్నట్లు ఒక్క చెంపదెబ్బ ఛెళ్లుమని తగిలిందామెకు. ఆమె కళ్లుతిరిగి నేల కొరిగింది. ఆమె నోటినుండి శబ్దం రాలేదు. అతని నోటినుండి మాటరాలేదు. ఆమె కళ్లు విప్పేసరికి అత డింట్లో లేడు. ఆమె నెమ్మదిగా లేచి తన పనులు చేసుకోసాగింది.

(ముగింపు వచ్చే సంచికలో) ★

# నాగిని

"అమరేంద్ర"

నాలోన బుసకొట్టు నాగినివి నీవా?
పాటతో జోకొట్టు మాంత్రికుడవీవా?
పసిడి వెన్నెలరేల పడగెత్తి ఆడేను
మిసిమి కాంతులతోడ
మిడిసి పడిపోయేను
మెలికెలతో తళుకులతో
మెరుపులా సాగేను
చేతికందక ఎడద
లోతులను దాగేను

*　　*

నా కలల బాటలో
చిరుగాలి పాటలో
నా తలపుల పుట్టలో
నా ఆశల బుట్టలో
కదిలే నాగిని నీవా
కాదా, మరి చెప్పిపోవా?
ఏ రాగ పరాగ భరిత మీ నాగస్వరము?
జనన మరణ భయవిరహిత మధుర శాంతి వరము!
సురనదీ తరంగభంగ స్వప్నకాంతి భరము!
నందన సుమ చందన మృదుసౌరభ భాసురము!
నాలోన బుసకొట్టు నాగినివి నీవా?
పాటతో జోకొట్టు మాంత్రికుడవీవా?